ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

హార్బర్ పనులు ముందుకుసాగేనా ?



ఫిషింగ్ హార్బర్ శంకుస్థాపన కార్యక్రమంలో కలెక్టర్ తదితరులు (ఫైల్ ఫోటో)

- సర్వే పూర్తికాకుండానే ప్రధాని శంకుస్థాపన
- మరోసారి అంచనా వ్యయంపై సర్వే
- సిఐసిఇఎఫ్‌కు బాధ్యత అప్పగింత
- పూడిమడక చేపలరేవుకు కేంద్రం మోకాలడ్డు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో నిర్మించబోయే ఫిషింగ్ హార్బర్‌కు బాలారిష్టాలు వీడటంలేదు. గత నెల 30న వర్చువల్‌లో రూ.387 కోట్ల విలువైన ఈ హార్బర్ పనులకు ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు. అయితే, హార్బర్ నిర్మాణ పనులు జోరందుకుంటాయన్న ఆశలను తలకిందులుచేసే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపనకు ముందే చేసింది. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి ప్రధాని శంకుస్థాపన చేశారు. పిషింగ్ హార్బర్ల నిర్మాణ అవకాశాలు, వ్యయ అంచనాలపై గతంలో డబ్ల్యుఎపిసిఒఎస్ పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను తయారుచేసింది. దీన్ని కాదని కొత్తగా డిపిఆర్ తయారుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఫిషింగ్ హార్బర్ పనుల్లో మరింత జాప్యం జరగనుంది. జిల్లాలోని పూడిమడక సహా రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్లపై కొత్తగా డిపిఆర్ తయారుచేసే బాధ్యతను బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీ (సిఐసిఇఎఫ్)కు అప్పగించింది. హార్బర్ ప్రదేశాన్ని పరిశీలించేందుకు కొద్ది రోజుల క్రితం రెండుసార్లు సిఐసిఇఎఫ్ బృందం పూడిమడక వచ్చి వివరాలు సేకరించి వెళ్లింది. హార్బర్ నిర్మించే ప్రదేశానికి సమీపంలో ఉన్న కొండను ఆనుకొని నిర్మాణ పనులు చేపడితే ఖర్చు తగ్గుతుందని మత్స్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కొత్త డిపిఆర్ తయారుచేసి, ఆమోదించే సరికి ఏడాదిన్నర సమయం పడుతుందని భావిస్తున్నారు. పూడిమడక హార్బర్‌ను 30 ఎకరాల విస్తీర్ణంలో రూ.387 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు అప్పట్లో టెండర్లు కూడా పిలిచారు. స్థలాన్ని ఎపి మారిటైం బోర్డుకు అప్పగించారు. అయితే పూడిమడక వద్ద సరైన రహదారి లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. వాహనరాకపోకలకు అంతరాయం లేకుండా రహదారికి సరిపడా స్థలం సమకూర్చే సరికి కొన్ని సంవత్సరాలు పట్టింది. ఇవన్నీ దాటుకొని ప్రధాని శంకుస్థాపన చేయడంతో హార్బర్ పనులకు ఆటంకాలన్నీ తొలగిపోయాయని అనుకుంటే తాజాగా హార్బర్ నిర్మాణ వ్యయ అంచనాలు తయారు చేయాలని కేంద్రం నిర్ణయించడంతో మళ్లీ హార్బర్ పనులు మొదటికి వచ్చాయి. ప్రస్తుత నిర్మాణ వ్యయ అంచనాను రూ.387 కోట్ల నుంచి కనిష్ట స్థాయికి తగ్గించి ఇచ్చిన నివేదిక ఆధారంగా పనులు ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోంది.

సముద్రంలో చేపల వేటకు వెళు_న్న గ్రామీణ తీరప్రాంత మిగతా 2లో..

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

రొయ్యల పెంపకంపై దృష్టి పెట్టండి

కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

వార్త మెయిన్‌లో..

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించండి

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ బొగ్గు కొరత సమస్యను పరిష్కరించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు ఆయన వారిద్దరికీ లేఖలు పంపారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కొన్ని నెలల మిగతా 2లో..

జిఒ 115పై నర్సుల నిరసన

వార్త 2లో..

బాలల హక్కులను పరిరక్షించాలి

వార్త 4లో..

టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలి

వార్త 5లో..

గణనాథుల సందడి

నేటి నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం

వినాయక చవితి ఉత్సవాలకు విశాఖ నగరం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం నాటికే మండపాల వద్దకు గణనాథులు చేరిపోయారు. భారీ సెట్టింగ్‌ల నడుమ మండపాలు కొలువుదీరాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో మిరమిట్లుగొలిపాయి. గాజువాకలో బెల్లం అచ్చులతో రూపుదిద్దుకున్న భారీ వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాడు. మరోపక్క పూజా సామగ్రి అమ్మకాలతో పూర్ణామార్కెట్ శుక్రవారం కిటకిటలాడింది.

గాజువాక బెల్లం గణేషుడు

కిటకిటలాడుతున్న పూర్ణామార్కెట్

దొండపర్తిలో భారీ గణనాథుడు

మొదటి పేజీ తరువాయి..

హార్బర్ పనులు ముందుకుసాగేనా ?

మత్స్యకారులకు హార్బర్ ఎంతో ఉపయోగపడనుంది. మత్స్యకారుల వలసలు తగ్గనున్నాయి. 700 నుంచి వెయ్యి మెకనైజ్డ్ బోట్లును సురక్షితంగా హార్బర్‌లో పెట్టుకొనేలా అప్పట్లో హార్బర్‌ను డిజైన్ చేశారు. జిల్లాలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 73 కిలోమీటర్ల తీర ప్రాంత మత్స్యకారులు 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని నాడు అంచనా వేశారు. కానీ తాజా సర్వేతో హార్బర్ పనుల్లో మరింత జాప్యం జరగనుంది.

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించండి

నుంచి బొగ్గు కొరతతో తీవ్ర ఉత్పత్తి సమస్యను ఎదుర్కొంటోందన్నారు. ఇప్పుడు ప్రమాద స్థితికి చేరి ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదంలో పడిందని తెలిపారు. అదానీ గంగవరం పోర్టు కుట్రతో సాగుతున్న ఆటంకాలను తెలిపారు. ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ విదేశాల నుంచి రప్పించిన బొగ్గు గంగవరం పోర్టులో లక్షా 54 వేల టన్నులు ఉందన్నారు. అలాగే విశాఖపట్నం పోర్టులో మరో 89 వేల టన్నులు విదేశీ బొగ్గు ఉందన్నారు. బకాయి చెల్లించాలనే పేర కొంతమంది ట్రేడర్లు పోర్టులో ఉన్న విదేశీ బొగ్గుపై హైకోర్టు నుండి అటాచ్‌మెంట్ తీసుకువచ్చి బొగ్గును తమ ఆధీనంలోకి తీసుకొని, స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి జరగనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ మూతపడే ప్రమాదస్థితికి చేరిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అండతో ప్లాంట్‌ను నష్టాలపాలు చేసి మూసివేయించాలనే కుట్రతో అదానీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకొని బొగ్గును విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎలాంటి ఆటంకమూ లేకుండా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విశాఖ ప్రజలకు ఉక్కు రక్షణపై ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి విశాఖకు వచ్చి ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ఆదేశాలతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కర్మాగారాన్ని అర్ధాంతరంగా మూసివేసే చర్యలను తీసుకుంటోందన్నారు. కార్మికులు, ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు, సదుపాయాలపై కోత విధించే చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. ఇటీవల తప్పుడు ఆరోపణలు మోపి 272 మంది ఇంజినీర్లుకు షోకాజ్ నోటీలు ఇచ్చి భయాందోళనకు గురిచేసిందని తెలిపారు. అత్యంత బాధ్యతారహితంగా, అవినీతి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని కోరారు.

విజయవాడలో పారిశుధ్య పనులు చేపడుతున్న జివిఎంసి కార్మికులు

విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో.. నిర్విరామంగా జివిఎంసి పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో మూడు రోజుల నుండి నిర్విరామంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నట్టు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలోగల 20 నుంచి 64 వార్డుల పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో మూడు రోజుల నుండి ప్రజలకు సహాయక చర్యలు అందిస్తున్నామన్నారు. బాధితులకు ఆహారం, మంచినీరు అందిస్తూ, మధురానగర్, అజిత్ సింగ్ నగర్, వాంబే కాలనీ, కండ్రిక తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. జివిఎంసి నుండి తీసుకువెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వెహికల్స్, అందుబాటులోనున్న ట్రాక్టర్ల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేస్తున్నామన్నారు. ఈ సహాయక చర్యలు మరో మూడు, నాలుగు రోజులు పాటు కొనసాగుతాయని తెలిపారు.

నగర ప్రజలకు మేయర్ వినాయక చవితి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర ప్రజలకు మేయర్ గొలగాని హరివెంకట కుమారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు విశాఖ నగరాన్ని కలుషిత పరచకుండా పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలతో వినాయక చవితిని జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసు కుటుంబాలకు కెజిహెచ్‌లో వైద్య సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నగర పోలీసు కుటుంబ సభ్యులకు కెజిహెచ్ సహకారంతో కెజిహెచ్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 3,500 మందికి వైద్యులు పరీక్షలు జరిపారు. అవసరమైన చికిత్స, మందులు అందించారు.

10న 'ఉక్కు' రక్షణ రాస్తారోకోలను జయప్రదం చేయండి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన రాస్తారోకోలను జయప్రదం చేయాలని, విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, ప్లాంట్‌కు పరిష్కారం కనుగొంటామని చెప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తాము ప్రైవేటీకరణకు వ్యతిరేకమని చెప్పిన విషయాన్ని కుమార్ గుర్తుచేశారు. కానీ వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉందన్నారు. నేడు రోజు రోజుకూ ప్లాంట్ పరిస్థితి దిగజారుతోందని, ఉత్పత్తి తగ్గుతోందని అన్నారు. ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూత పడ్డాయన్నారు. మరో పక్క కార్మికులను తగ్గించాలని విఆర్‌ఎస్‌ను తీసుకొస్తున్నట్టు ప్రకటనలు వస్తున్నాయన్నారు. ప్లాంటులో పర్మినెంట్ కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. మొత్తంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి అవసరమైన చర్యలను దొడ్డిదారిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోందని విమర్శించారు.

ఈ నేపథ్యంలో 'విశాఖ ఉక్కు - తెలుగు ప్రజల హక్కు' నినాదంతో దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

జిఒ 115పై నర్సుల నిరసన

కెజిహెచ్‌లో నిరసన తెలుపుతున్న నర్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిఒ 115ను రద్దు చేయాలంటూ శుక్రవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నర్సులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు లలిత, ప్రధాన కార్యదర్శి టిజిఎస్ఎన్.కుమారి మాట్లాడుతూ శని, ఆదివారాలలో కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలపాలని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం నుంచి విధులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న దాదాపు 11500 మంది స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. భవిష్యత్తులో రెగ్యులర్ నోటిఫికేషన్స్ ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఐదుగురు స్టాఫ్ నర్సులను నియమించాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు. కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులకు రూ.50 లక్షల బీమాను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సలను వెంటనే పరస్పర అంగీకార బదిలీలకు అనుమతించాలని కోరారు. ఈ మేరకు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందకు వినతిపత్రం సమర్పించారు.

గొలుగొండ : కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సుల సంఘం నాయకులు నాగమణి, ప్రశాంతి, అలివేణి మాట్లాడుతూ ఖాళీలను కాంట్రాక్టు స్టాఫ్ నర్సులతో భర్తీ చేయాలని, జిఒ నెంబరు 115ను రద్దు చేయాలని కోరారు.

హెల్మెట్ ధరించని వారిపై కొరడా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. వాహనదారుల వెనుక కూర్చున్నవారు హెల్మెట్ ధరించకున్నా శిక్షలు విధించారు. 837 మంది డ్రైవింగ్ లైసెన్సులను 3 నెలల పాటు రద్దు చేసినట్టు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజరత్నం శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు 22,325 కేసులు నమోదు చేశామని, వాటిలో 837 మంది డ్రైవింగ్ లైసెన్సులను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి -విఆర్.పురం : వర్షాలు, వరదలు కారణంగా డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, టైఫాయిడ్ వంటి రోగాలు బారిన ప్రజలు పడ్డారని, వారికి సరైన వైద్యం అందించాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంపిపి కారం లక్ష్మి వైద్యులకు సూచించారు. మండలంలోని రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు సందర్శించారు. ఆసుపత్రిలో జ్వరాలతో బెడ్లపై ఉన్న రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్యులు, ఆశా వర్కర్లు గ్రామాలను సందర్శించి ప్రజలు ఎలాంటి వ్యాధులు బారిన పడకుండా చూడాలన్నారు. అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని, రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపకుండా ఇక్కడే వైద్యులు సరైన వైద్యం అందించాలని సూచించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ ఆదిశక్తి అమ్మవారి వాడబల్జి సేవా సంఘానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైసిపి సీనియర్ నాయకులు లింగం శ్రీను, ఎర్నిమాంబ అమ్మవారి గుడి చైర్మన్ లండ రమణ, అప్పలరాజు, సత్తిబాబు, దూడ అప్పారావు, నాగమణి, దానియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వినాయక ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆశీలుమెట్ట వద్ద ఉన్న శ్రీ సంపత్ వినాయక దేవస్థానంలో వినాయక చవితి సందర్భంగా శనివారం ఉదయం 4 గంటల నుండి 6:30 గంటల వరకు హోమం, అభిషేకం కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ ఆర్.ఛోలన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు

PUBLIC NOTICE

My Client Mr. **RAYAPATI RAMA RAJU**, S/o. Narsimha Raju, resident of Plot No.172, Town Center Layout, Ring Road, Vizianagaram, has informed that

My client acquired the schedule property vide a Regd. Sale Deed, Doct. No 62/2018, Dt.04-01-2018 (SRO-VIZIANAGARAM), executed by one Smt. Yerninti Padma, W/o. Appa Rao. During the time of purchase my client was unfortunately not collected one it's link document i.e., SALE Deed, Doct. No: 6013/2005,11-07-2005 (SRO VIZIANAGARAM) from my client vendors and now the same is not traced out with the vendors.

Therefore, this Public Notice is issued to all, that anybody has custody of the said lost document, (or) claim, right (or) objection over the Schedule property, they shall come forward with documentary proof within Five (5) days from the date of this Notice to the undersigned, else it shall be deemed that there are no claims (or) objections over the schedule property, and the transaction will be proceeded with.

SCHEDULE

All that property house site measuring an extent of 196 Sq.yards or 163.88 Sq. mtrs, bearing Plot No. 15 covered by Survey No. 56/12 (old) and 56/28(New) situated at Sri Suryanagar Layout, Jammunarayanapuram Village, Vizianagaram Municipality, Vizianagaram District and bounded as follows,
East : Land covered by Survey No.34
South : Plot No.16,
West : Plot No.14
North : Layout Road

PALAVALASA RAMBABU,
Advocate, #47-11-1/9, II Floor,
Flat No.4, ESWAR ARCADE, 1st LANE
DWARAKANAGAR, Visakhapatnam-16
Ph. No. 9848202060.

**IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 1628/2022**

Between:
State Bank of India, SME Centre
Visakhapatnam,
Rep. by its Manager ...Plaintiff
And:
Sri Durga Matha Saree Material,
Rep. by its Prop: Kaki Durga Bhavani
& another ...Defendants

SUMMONS

To,
D-1:Sri Durga Matha Saree Material,
Rep. by its Prop: Kaki Durga Bhavani,
D.No.58-31-41, Saketapuram,
NAD Quarters, Ward No.42,
Visakhapatnam-09.
D-2: Kaki Durga Bhavani,
Hindu, aged 39 years,
Proprietor of Sri Durga Matha
Saree Material, Rest-do-

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **18-09-2024** for your appearance on that day at **10:30 A.M.**, you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heardand determined in your absence, ex-parte asper law.

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI,
Advocate
Balajinagar, Siripuram,
Visakhapatnam.

**IN THE HON'BLE COURT OF THE VI ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1090/2018**

Between:
Venuchoorupalli Sitha
(Rep. by her G.P.A. Holder
Doddi Venkata Narayana Rao)
...Plaintiff
And:
Ch.S. Padmakar ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Ch.S. Padmakar,
S/o. Narasinga Rao,
Hindu, Aged about 47 years,
Shanmukha Home Needs,
Main Road, Pendurthi,
Visakhapatnam, R/at D.No.49-19,
VUDA Apartments, Opposite
Lakshmi Kalyana Mandapam,
Vepagunta (S.O), Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount of Rs.8,50,000/- and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **13-09-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **13-09-2024 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

VOONA VIJAYA KUMAR
VOONA SRI VARSHA,
Advocates,Visakhapatnam-17.

మత్స్యరంగంపై పరిశోధనలకు సిఐఎఫ్‌టితో గీతం ఎంఒయు

ఎంఒయు పత్రాలను మార్చుకుంటున్న గీతం, సిఐఎఫ్‌టి ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : మత్స్యరంగంపై సంయుక్త పరిశోధనలను చేపట్టడానికి వీలుగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలికి చెందిన సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సిఐఎఫ్‌టి)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ, సిఐఎఫ్‌టి (కొచ్చిన్) డైరెక్టర్ డాక్టర్ జార్జి నినన్‌తో అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సిఐఎఫ్‌టి డైరెక్టర్ డాక్టర్ జార్జి నినన్ మాట్లాడుతూ, దేశంలోని మత్స్యరంగంలో పరిశ్రమలకు, మత్స్యకారులకు, పరిశోధకులకు, యువతకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలోని గుజరాత్, మహారాష్ట్రతో పాటు విశాఖలోని సిఐఎఫ్‌టి పరిశోధన కేంద్రం పలు విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తోందన్నారు. మత్స్యరంగంలో యువతకు అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని, 400కుపైగా బిజినెస్ ఇంక్యుబేటర్‌లను ప్రోత్సహించామని తెలిపారు. గీతంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా మత్స్యరంగంలో పరిశోధనలకు, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడానికి సహకరిస్తామన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దాదాపు రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలు, పరిశ్రమలతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. గీతం అధ్యాపకులు పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిఎస్.కృష్ణ మాట్లాడుతూ, సముద్ర సంబంధ పరిశోధనల పట్ల తాము ఆసక్తితో ఉన్నామని, దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్ఐఒ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. సిఐఎఫ్‌టి సహకారంతో మత్స్య రంగంపై సంయుక్త ప్రాజెక్టులను నిర్వహిస్తామన్నారు. సిఐఎఫ్‌టి విశాఖ శాఖ అధిపతి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, మత్స్యసంబంధ పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గీతం జీవశాస్త్ర విభాగాల అధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ అనిత, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సన్ముఖానంద తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిడుగుపాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం గ్రామంలో శుక్రవారం పిడుగుపాటుకు గురై మహిళ మృతి చెందినట్లు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. పెద గొల్లలపాలెం గ్రామానికి చెందిన వంగలపూడి రాములమ్మ (56) శుక్రవారం కూలిపనికి వెళ్లి వర్షంతో పొలంలో వరి నాట్లు వేస్తోంది. ఈ సమయంలో ఆమెకు దగ్గరలో పిడుగుపడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లుగా తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు. మృతురాలికి ఇద్దరు కుమారులు నాగరాజు, పైడిరాజు, కుమార్తె గంగతల్లి ఉన్నారు.

వార్డు సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడు, నాలుగు వార్డుల్లోని పలు సచివాలయాలను డిఎల్‌డిఒ బి.లక్ష్మీపతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. మూడో వార్డు చిన్న బజారు, తోట వీధి, నాల్గో వార్డు జెవి.అగ్రహారం వార్డు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ

జర్నలిస్టులకు వినాయక విగ్రహాల పంపిణీ

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, రవి తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

వినాయకచవితి సందర్భంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీచేశారు.

గాజువాక : అనురాధ ఆటో సర్వీస్ సెంటర్ షీలానగర్ పెట్రోల్ బంకులో మట్టి గణపతి ప్రతిమలను గాజువాక ట్రాఫిక్ సిఐ కోటేశ్వరరావు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుమారుడు శ్రావణ్ శ్రీహర్ష పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బంకు ప్రతినిధి రవి పాల్గొన్నారు.

మాధవధార : సీతమ్మధారలో ఉన్న హైవే వెంచర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ ఆధ్వర్యాన 10 వేల మట్టి వినాయక ప్రతిమలు, పూజా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కింజరాపు ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో14వ వార్డు కార్పొరేటర్ కఠారి అనిల్‌కుమార్‌రాజు, డాక్టర్ చింతాడ హేమారావు, సంస్థ బ్రాంచ్ మేనేజర్లు రమణారావు, వైదేహి మాధవి పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ మిథిలాపురి లే-అవుట్‌లో ఉత్తరాంధ్ర ఎలక్ట్రానిక్ మీడియా, పిఎం పాలెంలో కెవిఆర్ కేటరర్స్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : దివీస్ సంస్థ ఆధ్వర్యాన మండలంలోని చిప్పాడ, మూలకుద్దు తదితర గ్రామాల ప్రజలకు, సంస్థ ఉద్యోగులకు 6 వేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఇంజినీర్ రమేష్, జిఎంలు ఎంఎస్ఎన్.రావు, వైఎస్.కోటేశ్వరరావు, ఈసిడి, డిజిఎం బాలాజీ, మేనేజర్ ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

భీమిలిలోని శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యాన భీమిలి గంట స్తంభం వద్ద మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొమ్మినేని ఎర్రునాయుడు, ముఖ్య సలహా దారు జి.సాయి, పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన పలువురు న్యాయ వాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షి దారులకు శుక్ర వారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.పార్వతీశం, కోశాధికారి ఎం.సునీల్, ఎపిపి రవి, పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణి ఆధ్వర్యాన పలువురికి పంపిణీ చేశారు.

పద్మనాభం : మండలంలోని రేవుడి గ్రామంలో శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యాన మట్టి వినాయక ప్రతిమలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎండిఒ సత్య బాపిరాజు, తోగురోతు తమ్ము నాయుడు, కోన సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు ఎస్ఆర్‌కె కన్స్ట్రక్షన్స్ యజమాని కె .రామరాజు తుఫాను బాధితులకు రూ.లక్ష సిఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గోపాలకృష్ణమూర్తి, రాజు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు గణపతి నగర్ సామాజిక భవనం వద్ద గణపతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మట్టి విగ్రహాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భూరేల అప్పలనాయుడు, రెడ్డి కూర్మారావు, బూరెల నరసింగనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం జంక్షన్ వేములవలసలో శ్రీ షిరిడి సాయి సెల్ కార్నర్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. సెల్ కార్నర్ యజమాని మేడిశెట్టి రాంజీ ఆర్థికసాయంతో సమకూర్చిన సుమారు 1000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సినగం చిన్న రామారావు, ఎంపిటిసి రౌతు శ్రీను పాల్గొన్నారు.

ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి మనవరాలు విద్య శ్రీ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఒఎన్‌జి ఫౌండేషన్, స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ సంయుక్తంగా 500 మట్టి వినాయకులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో గొలగాని నరేంద్ర కుమార్, త్రినాథ్ సురేష్ చందు గోవింద్ పాల్గొన్నారు.

కొత్తూరులో ఉన్న శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాల ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాంగలి వెంకటేశ్వరరావు, తమ్మి నర్సింగరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్‌ఐటి కళాశాలలో సొంటి ఎన్ఎస్ఆర్‌పి కళాశాలలో 600 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, పిఒ హరిగోపాల్ పాల్గొన్నారు.

మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ పర్యావరణ శాస్త్ర విభాగం, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మట్టితో తయారైన వినాయక ప్రతిమలను పంపిణీచేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వేమన మందిరంలో ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో. మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టులకు పంపిణీ చేశారు. జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మట్టి గణపతులను వాడటం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించినవారిమి అవుతామన్నారు. కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఏటా జర్నలిస్టులు పండగలు నిర్వహించడం, అందులో తమను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ, నాయకులు ఎ.సాంబశివరావు, డి.రవికుమార్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జివిఎంసి ఉద్యోగులకు, ప్రజలకు 600 మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యుసిడి పిడీ ఫణిరామ్ పాల్గొన్నారు.

నర్సీపట్నం: వినాయక చవితిని పురస్కరించుకుని సిటీ క్లబ్, గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో 3,000 మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పీకర్ అయ్యన్న కుమారుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ హాజరై విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, పర్యావరణ హితమైన 3,000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సిటీ క్లబ్ ప్రెసిడెంట్ పల్లా దొరబాబు, కార్యదర్శి పెదిరెడ్ల చింతు, కోశాధికారి బొంతు జగదీష్, కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లంకా ప్రసాద్, కృష్ణ, మంగరాజు, పెదిరెడ్ల నాగేశ్వరరావు, గ్రీన్ క్లబ్, సిటీ క్లబ్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మాడుగులలో 200 మట్టి వినాయక ప్రతిమలను వితరణ చేశారు. మట్టి వినాయకుని పూజించడంతో అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని మాడుగుల ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ శ్రీనివాసరావు, సూర్యనారాయణ రాజు, బొమ్మిశెట్టి శ్రీను, మండల సతీష్, పెరుమాళ్ళ వెంకట్రావు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక పివి కాంప్లెక్స్ ముందు మట్టి విగ్రహాలను జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ పంపిణీ చేశారు. నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో పదివేల మట్టి విగ్రహాలు పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యాక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె శివనారాయణ (నానాజీ), కొరాడ సాంబశివరావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని మునగపాక, మూలపేట, ఒంపోలు గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి కూటమి నేతలు కర్రి సాయికృష్ణ, ప్రగడ నాగేశ్వరరావు, సుందరపు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండల కేంద్రంలో జనసేన నాయకులు సతీష్ కుమార్ చేతుల మీదుగా వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు బి.రాందాస్, ఎం.శ్రీవేణి, జె.నర్సింగరావు, కూనిశెట్టి రమణ పాల్గొన్నారు.

పరవాడ : మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణం కాపాడుకొందాం అనే నినాదంతో ఫార్మాసిటీ లారస్ లాబ్స్ వారు చుట్టూ పక్కల గ్రామాల్లో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చావా రామకృష్ణ, పిల్లా జగదీష్, చుక్కా రవి కుమార్, హరి, జాన్, నిఖిల్ పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక ఎస్ఎస్ షాపింగ్ మాల్ వద్ద పిఎల్ఎన్ గుప్తా, పెట్రోల్ బంకు వద్ద కలగర్ల శేషు, వినాయకుని గుడి వద్ద అక్కినేని నాగేశ్వరరావు ఫ్యాన్స్, ఉషోదయ కాలేజీలో చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ వినాయక ప్రతిమలను అందజేశారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

చోడవరం రూరల్ : స్థానిక వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. చోడవరం సిఐ డి.శేఖరం వీటిని ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూసర్ల సంతోష్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, వేచలపు అర్జునరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు సతీమణి సూర్య కుమారి, తనయుడు రాజేష్ అనకాపల్లి నరసింగరావుపేటలోని తమ నివాసం వద్ద మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రజలు సంఘటితమై పోరాడాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజకీయ పార్టీలు, ప్రభుత్వాల నుంచి మహిళలకు న్యాయం జరుగుతుందని ఆశించలేమని, ప్రజలు సంఘటితమై పోరాడినప్పుడే నేరస్తులకు శిక్షలు పడే అవకాశముందని పౌర చైతన్య వేదిక నాయకులు సి హెచ్.ప్రమీల పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై హత్యాచాలకు వ్యతిరేకంగా విశాఖ పౌర గ్రంథాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ సి హెచ్.ప్రమీల మాట్లాడుతూ, కోల్‌కతా ఆర్జికర్ హాస్పిటల్‌లో లేడీ డాక్టర్‌పై జరిగిన ఘోర సామూహిక అత్యాచారం, కిరాతక హత్య జరిగి 27 రోజులు దాటినప్పటికీ నేరస్తులందరినీ అరెస్టు చేయలేదని విమర్శించారు. ఆ హాస్పిటల్‌లో రాజకీయ నాయకులు, పోలీసులు, అధికార యంత్రాంగం, నేరస్తులు కలిసి నేర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారని, అందువల్లనే మిగతా నేరస్తులందరూ తప్పించుకొని తిరుగుతున్నారని ఆరోపించారు. నేరస్తులకు శిక్ష పడుతుందనే భయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆంధ్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్ నేషనల్ బిజినెస్ ప్రొఫెసర్ కోలవెన్ను మాట్లాడుతూ, మద్యం, డ్రగ్స్, పోర్న్ సైట్స్, సినిమాలలో మితిమీరిన హింస వల్ల మహిళలపై అమానుష నేరాలు పెరుగుతున్నాయన్నారు. విద్యా వ్యవస్థ ద్వారా యువతలో నీతి, నైతిక విలువలను, ఉన్నత సంస్కృతిని, సామాజిక బాధ్యత స్పృహను పెంపొందించినప్పుడే మహిళలపట్ల పురుషులలో పాతుకుపోయిన తప్పుడు భావాలను నిర్మూలించగలమని పేర్కొన్నారు.

యువత భయాన్ని వీడి అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, పౌర చైతన్య వేదిక నాయకులు ఎస్.గోవిందరాజులు, వివిధ కళాశాల విద్యార్థులు తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి జీవితం, పోరాటం, యువతకు ఆదర్శం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

90వ వార్డులో గణబాబు పర్యటన

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇటీవల కురిసిన వర్షాలకు జివిఎంసి 90వ వార్డు ఎఫ్ బ్లాక్‌లో రిటైనింగ్ వాల్స్ లేక మట్టి జారి మెట్లు కూలిన ప్రదేశాలను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్‌తో జోన్-8 ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడి త్వరగా పనులు మొదలుపెట్టాలన్నారు. ఈ పర్యటనలో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వార్డు అధ్యక్షులు ఎలమంచిలి ప్రసాద్, మాణిక్యాలు, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిప్సా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : పాతగాజువాకలోని గ్రీన్ ఆపిల్ హోటల్‌లో జిప్సా ఆధ్వర్యాన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విశాఖపట్నం ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.విజయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనుగుణంగా జరుగుతున్న మార్పులు, అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు బోధన జరపాలన్నారు. జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు మాట్లాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు నడుచుకోవాలని సూచించారు. అనంతరం జిప్సా అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న జె రమేష్‌నాయుడు (సాగర్ స్కూల్), కె.సత్యనారాయణ (విజ్ఞాన్ బ్రిలియంట్ స్కూల్), యమ్ సత్యన్నారాయణ (బాపూజీ విద్యాలయం), ఎ.రాము (శరత్ స్కూల్), జి.ప్రశాంత్‌కుమార్ (కుమార్ టాలెంట్ స్కూల్), యస్ వెంకటరావు (రాజీవ్ విద్యా నికేతన్)ను అతిథులు, జిప్సా సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు శోభన్‌బాబు, సలహాదారు జగ్గారావు, కోశాధికారి శ్రీనివాసరావు, బాబూరావు, వాసుదేవరావు, సత్య మురళీ సుందర్, రవికుమార్, విజయ్, పరశురామ్, స్వామి పాల్గొన్నారు.

విజయవాడకు పంపిస్తున్న బ్రెడ్, మిక్చర్ ప్యాకెట్లు

వరద బాధితులకు వితరణ

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : వాసవ, తోకాడ అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడ వరద బాధితులకు 13000 బ్రెడ్ ప్యాకెట్లు, 3000 మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవ అధ్యక్షులు పాండురంగ ప్రసాద్‌రావు, ట్రెజరర్ ప్రభాకర్ రావు, దేవి ఫుడ్స్ అధినేత సత్యనారాయణ, పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

వరద బాధితుల సహాయార్థం చినగంట్యాడలో సిపిఐ ఆధ్వర్యాన విరాళాలు సేకరించారు. రూ.11,600 సేకరించి సిపిఐ జిల్లా సమితికి అందజేసింది. సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, వరదల ప్రళయానికి విజయవాడ ప్రజలు నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవడం కోసం విరాళాల సేకరణ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఆనంద్, కె.పోతన్న, కెంగువ అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, కె వనజాక్షి , పిల్లా పద్మ పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడలో సిపిఐ ఆధ్వర్యాన షాపుల యజమానులు, చిరు వ్యాపారస్తులు, ప్రజల దగ్గరకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, మానవులంతా చేతనైనంత సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎండి బేగం, బంగారయ్య, త్రినాథ్, ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి -ఆనందపురం : వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆనందపురం సిఐ టీవీ తిరుపతిరావు పేర్కొన్నారు. వినాయక ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా మండపానికి, విగ్రహానికి, విద్యుత్, డీజే, బాణసంచాకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ స్పష్టంచేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనుమతులు లేని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'వైసిపి అసమర్థ పాలనతోనే బుడమేరు ముంపు'

ప్రజాశక్తి -భీమునిపట్నం : బుడమేరు ముంపునకు గత ఐదేళ్ల వైసిపి అసమర్థ పాలన ప్రధాన కారణమని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బుడమేరుకు 2019 తర్వాత గండ్లు పడితే వాటిని పూడ్చాలనే కనీస చర్యలు తీసుకోలేదని, దీని వల్ల సమస్య మరింత తీవ్ర రూపం దాల్చిందని అన్నారు. ఓ వైపు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సహకరించాల్సింది పోయి రాజకీయ విమర్శలు చేస్తూ అరాచకం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. సిఎం చంద్రబాబుపై ఇష్టా రీతిన తప్పుడు విమర్శలు చేస్తున్న వైసిపి నాయకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో భీమిలి తీరంలో సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన కాంక్రీట్ కట్టడాలను కూల్చివేయడాన్ని అభినందించారు. అవ్యాన్ రియల్టర్స్ ఎల్ ఎల్ పి సంస్థ గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని తీరంలో కాంక్రీట్ కట్టడాలు నిర్మించినట్లు ఆరోపించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ పప్పూర్ నికుంజ్, ఆడారి ఉమా శంకర్, గండి బోయిన పోలి రాజు, కొక్కిరి అప్పన్న, యానాపు శ్రీనివాసరావు, వి పోతురాజు పాల్గొన్నారు

9 నుంచి జెసిఐ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : జెసిఐ 75 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జెసిఐ సీన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు. లలితనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జెసిఐ సురేష్ జంప, వై.హరికుమార్ సౌజన్యంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచన, క్లైమేట్‌పై అవగాహన, వాయిస్ ఆఫ్ యూత్, ఎలక్ట్రిక్ వేస్ట్ బిన్, స్కిల్ డెవలప్‌మెంట్, కంప్యూటర్ స్కిల్స్, యోగా శిక్షణ, విన్ కాంపిటీషన్ బిజినెస్‌పై అవగాహన, గ్రాఫిక్ డిజైనింగ్, డిజిటల్, దుస్తులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : బాలల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టం చేశారు. బాలల హక్కులు అంశంపై స్థానిక మూలకుద్దు గల్లీరోడ్డు వద్ద ఉన్న కేథరిన్ విద్యా సంస్థలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన వలు ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కారణాలు ఏమైనా 13, 14, 17 ఏళ్ల లోపు బాలికలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాల బాలికల్లో వ్యక్తిత్వ వికాసం పెంపుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 14 ఏళ్ల లోపు ఉన్న వారిచే పనులు చేయించ రాదని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ ఏర్పాటుకు పేదరికం, వలసలు ప్రధాన కారణమవుతున్నాయని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పాఠశాలల్లో సరిపడా టాయిలెట్లు లేక పోవడంతో 29.7 శాతం బాలికలు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని సర్వేలు చెబుతున్నాయన్నారు. బాలల హక్కులను కాపాడుకోవడం పౌరులుగా మనందరి ప్రాథమిక కర్తవ్యం అని నొక్కి చెప్పారు. జిసిడిఒ డాక్టర్ కలేషా బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి, సైకాలజిస్ట్ వంశీ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఇఒ ఎం.శివరాణి, కేథరిన్ విద్యా సంస్థ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రమణికుమారి మాట్లాడుతూ, కిషోర్ బాలికల తల్లులకు, గర్భిణులకు పోషక విలువలు కలిగిన గుడ్లు, పాలు, రాగి పిండి తదితరాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. బెల్లం, మునగాకు, అవిసె గింజలు, వేరుశనగ ఉండలు, రాగి పిండిలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని వివరించారు. సృజన వెల్ఫేర్ అసోసియేషన్ అధినేత హరినాథ్ మెహర్షి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ జ్యోతిశ్రీ, మల్కాపురం అంగన్‌వాడి కార్యకర్త సునీత ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఎఎన్ఎం జ్యోతి, సుజాత, హేమావతి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - అరిలోవ : చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి శుక్రవారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చినగదిలి, రవీంద్రనగర్, దీన దయాళపురం, హనుమంతవాక తదితర ప్రాంతాల నుంచి అనేక సంఖ్యలో ప్రజలు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 25 మందికి కేటరాక్ట్ ఆపరేషన్ అవసరమని వైద్య నిపుణులు డాక్టర్ సుచిత్ర నిర్ధారించారు. వీరిని సోమవారం తమ ఆసుపత్రికి తరలించి మంగళవారం వైద్య పరీక్షలు జరిపి బుధవారం శస్త్రచికిత్స నిర్వహిస్తామని శంకర ఫౌండేషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ వై.రాజు తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ కంటి పరీక్షలు, మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి స్వల్పమైన కంటి సమస్యలు ఉన్నవారికి వైద్య సలహాలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తాలజిస్టులు వివేక్, వర్మ, నర్సింగ్ అసిస్టెంట్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు. ఈ శిబిరం నిర్వాహణకు షిర్డీ సాయిబాబా ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు, చీఫ్ సెక్రటరీ ఆర్.ఎ.పాత్రో, సభ్యులు మంగరాజు, రాము, ఉంగరాల శ్రీను సహకారం అందించారు.

పార్కును సందర్శించిన గంటా

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీ పార్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పార్కును త్వరలోనే ఆధునీకరించనున్నట్లు తెలిపారు. లైటింగ్, మంచినీటి సౌకర్యం,సెక్యూరిటీ తదితర అంశాలపై చర్చించి తొందర్లోనే పార్కును పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పిళ్లా వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. సుమారుగా 150 మంది తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలు పాల్గొన్నారు. పెరుగుతున్న విడాకుల రేటు, టీనేజ్ హింస, ఇతర సామాజిక సమస్యలు, విలువలు ఇవ్వడంలో తాతామామ్మల పాత్ర చాలా ముఖ్యమైనదని పాఠశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. తాత, మామ్మల పెంపకంలో పిల్లలు ఏ విధంగా ఉంటారో పలువురు అభిప్రాయాలను విద్యార్థులకు తెలియజేశారు. పిల్లల కలలు, ఊహలను అభివృద్ధి చేయడంలో తాత మామ్మలు సహాయం ఎనలేనిదని కొనియాడారు. పిల్లల మానసిక ఎదుగుదలకు ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులతో గ్రాండ్ పేరెంట్స్ చేసిన నృత్యాలు, ఆటపాటలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.ఉమామహేష్, చిన్నారులు, గ్రాండ్ పేరెంట్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : హెచ్ఐవి/ ఎయిడ్స్ నియంత్రణపై 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం భీమిలి మండలం మజ్జిపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యు ఎం.జ్యోతి మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది, వ్యాధి లక్షణాలు వివరించారు. హెచ్ఐవి ఉన్న వారి పట్ల వివక్ష చూపరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామంలో సోలార్ రూఫ్ టాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సోలార్ రూఫ్ టాఫ్ పథకం కింద 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. 10 శాతం దరఖాస్తుదారుడు కట్టాలని, మిగిలిన 90 శాతాన్ని తక్కువ వడ్డీకి రుణం ఇస్తారని చెప్పారు.

విద్యుదాఘాతంతో ఉపాధి కూలీకి తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం
- ఎపి ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యమే కారణం
- ప్రభుత్వం వైద్య సేవలు అందించి, కుటుంబాన్ని ఆదుకోవాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి డిమాండ్

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని తాణాం గ్రామంలో గ్రామీణ ఉపాధి పథకం పనులు చేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై ఉపాధి కూలీ చీపురపల్లి అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరం 80 శాతం మేరకు కాలిపోవడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్రాలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద గ్రామంలోని కంసాలి చెరువులో కొబ్బరి మొక్కలకు కంచె వేసు పనులు శుక్రవారం ఉపాధి హామీ కూలీలు చేపట్టారు. ఈ క్రమంలో అప్పర్ సీలేరు నుండి పెందుర్తి వెళ్లే ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ విద్యుత్ తీగలు ఉపాధి కూలీలు పని చేస్తున్న చెరువులో బాగా కిందకి వాలి ఉన్నాయి. భూమికి కేవలం పది అడుగులు ఎత్తులో ఉండడంతో అక్కడే పనిచేస్తున్న చీపురపల్లి అప్పారావును ఆ విద్యుత్ తీగలు ఆకర్షించడంతో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. సుమారు 80 శాతం శరీరం మొత్తం కాలిపోయింది. హుటాహుటిన స్థానికులు క్షతగాత్రుడుని విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అప్పారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఏపీ ట్రాన్స్‌కోకి చెందిన విద్యుత్తు తీగలు చాలా కిందకి వాలిపోయి ఉన్నాయని సంబంధిత అధికారులకు తాము ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఈ

తీవ్రంగా గాయపడిన చీపురపల్లి అప్పారావు

దుర్ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. ఏపీ ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉపాధి కూలీ విద్యుత్ ఘాతానికి గురై మృత్యువుతో పోరాడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వం బాధితుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

గుర్తింపు కార్డులు అందిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ట్రాన్స్ జెండర్స్‌కు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

ట్రాన్స్ జెండర్ పోర్టల్‌లో లాగిన్ అయి గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ట్రాన్స్ జెండర్స్‌కు గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎమ్.దీపికతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత ఇప్పటివరకు అనకాపల్లి జిల్లాలో 11 మంది ట్రాన్స్ జెండర్స్‌కు గుర్తింపు కార్డులతో పాటు సర్టిఫికెట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ట్రాన్స్ జెండర్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న మరో ఏడుగురికి గుర్తింపు కార్డులతో పాటు సర్టిఫికెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ ఎదుర్కొనే సమస్యల్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు జగదీష్, ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న జగనన్న లేఅవుట్లు

చెరువులా ఉన్న పైడివాడ అగ్రహారం జగనన్న లేఅవుట్

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారంలో జగనన్న మెగా లే అవుట్‌కి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం పరిహారం కింద విఎంఆర్‌డిఎ అభివృద్ధి చేసిన ప్లాట్లు వరదలకు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురికావడంతో ప్లాట్లలో నీరు చేరి నిల్వ ఉంది. కోట్లు రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు కోతకు గురికావడమే కాకుండా ప్లాట్లు నీరు నిండి ఇసుక మేట వేశాయి. రోడ్లకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు ఆరోపించారు. లే అవుట్‌కి వెళ్లేందుకు సరైన రహదారి లేకుండా మొత్తం రోడ్లన్నీ కోతకు గురయ్యాయని ఆయన తెలిపారు. ఈ విషయమై వుడా అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా వుడా అధికారుల తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వరద నీటికి మునిగిన పూరి గుడిసె

పూరి గుడిసెలోకి వర్షపు నీరు చేరిన దృశ్యం

చోడవరం : వర్షాలకు చోడవరం పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు మునిగితున్న పరిస్థితి నెలకొంది. బానయ్య కోనేరులో నీరు చేరడంతో దాసరి దుర్గ అనే మహిళ పూరి గుడిసె పూర్తిగా నీటిలో మునిగింది. దీనిపై స్థానిక వార్డు సభ్యులు నేమాల ధనలక్ష్మి హరి మాట్లాడుతూ చాలా మంది పేదలు వర్షాలకు పనులు లేక నీరు వచ్చి చేరడంతో ఆకలితో కాలం ఎలా వెల్లదీస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి వారికి ఆర్థిక సహాయం అందించడంతోపాటు పునరావాసం కల్పించాలని కోరారు.

ఇంజినీర్స్ డే పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంజనీర్స్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీర్స్ డే సందర్భంగా తమ కళాశాలలో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా "టెక్నోవా 2కె24" నేషనల్ లెవెల్ టెక్నికల్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ఆపిల్ ఐపాడ్, సామ్ సంగ్ టాబ్ వంటి ఆధునిక పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి భార్గవి, డైట్ ఐఈ స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్ కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైంటిఫిక్ టెంపోను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యార్థులు చదువుతోపాటు సైంటిఫిక్ టెంపోను అలవర్చుకోవాలని రెప్లికన్ ఐఐటీ జీ నీట్ అకాడమీ డైరెక్టర్ డిపిఎస్.రామకృష్ణ అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థుల మెదళ్లను పాదరసంలా తీర్చిదిద్దుతాయని, వారిలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను తెలివి తేటలను వెలుగులోకి తెస్తాయని చెప్పారు. దాదాపు 40 మందికి పైగా విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డైరెక్టర్లు రామకృష్ణ, డి.శివనాయుడు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు జి. వెంకటరమణ, కె పవన్, అరుణ్ కుమార్, ఎం కస్తూరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ శాఖ అనుసంధానం, సమన్వయంతో పనిచేసే విధంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి మోహన్ రావు, ప్రకృతి వ్యవసాయం విభాగం డీపీఎం సి హెచ్ లచ్చన్న ఆధ్వర్యంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం కార్యాలయంలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీలు ఏవోలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం పాటిస్తున్న పద్ధతులు ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్స్ సందర్శన చేయడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న రైతుల పంటలను బృందం సందర్శించి వారి అభిప్రాయాలు క్షేత్రస్థాయిలో తీసుకోవడం జరిగింది.

అదనపు ఎస్పీగా మోహన్‌రావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)గా ఎల్.మోహనరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం.దీపికని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల విద్యుత్ నగర్లో రూ.7 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. 15వ ఫైనాన్స్ నిధుల నుండి ఖర్చు చేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొయ్య జగదీశ్వరి భాస్కర్, సత్యనారాయణ, ఏఈ పిఆర్ కుమార్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్స్‌పై సర్వే

ప్రజాశక్తి- అనకాపల్లి : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్ వివరాలకై సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరీ లెట్రిన్ ఉన్న వివరాలను ఈనెల 10వ తేదీలోపు మున్సిపాలిటీ/ ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నల్ల బ్యాడ్జీలతో ఆసుపత్రి వర్కర్ల నిరసన

ప్రజాశక్తి చోడవరం : జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన స్థానిక ఆసుపత్రి వద్ద శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కోన లక్ష్మణ మాట్లాడుతూ ఆసుపత్రి కార్మికులకు కాంట్రాక్టర్లు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, పెరిగిన వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగ, నూక రత్నం, కోటిబాబు, నూక రాజు, కుమారి పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కోన లక్ష్మణ మాట్లాడుతూ 5 నెలలుగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేస్తున్నా సంబంధిత జిల్లా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను 15వ తేదీలోగా పరిష్కరించకుంటే ఆ తరువాత నుండి విధులు బహిష్కరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు అరుణ, దేవుడమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు, అప్పలరాజు, శ్రీను పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో నిర్మించిన సుమారు 2400 టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, నాయకులు బొప్పె ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావుతో కలిసి శుక్రవారం టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఇళ్లను ఇటీవల ఎన్నికల ముందు నాటి ప్రభుత్వం లబ్దిదారులకి హడావిడిగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగించిందని, వీటికి ఇంతవరకూ సరైన మౌలిక వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. ఈ ఇళ్లకు మంచినీరు, రహదారి సౌకర్యాలు వెంటనే కల్పించాలన్నారు. ఈ పరిసర ప్రాంతాలన్నీ తుప్పలతో నిండిపోవడంతో విషసర్పాలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని, దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని కోరారు. ఇల్లు నిర్మాణం నాణ్యతగా లేదని లబ్దిదారులు ఈ ఇల్లులో దిగక ముందే వర్షానికి కారుతున్నాయని తెలిపారు. కరెంటు మీటర్లు చిన్నపిల్లలకు అందే విధంగా బిగించారని, దీనికి రక్షణ చర్యలు కూడా చేపట్టలేదని, చిన్న పిల్లలు వాటిని ముట్టుకుంటే కరెంటు షాక్ కొట్టే ప్రమాదం ఉందని చెప్పారు. జీవీఎంసీ అన్ని ఇళ్లకు మంచినీరు అందించాలని, డ్రైనేజ్ శుభ్రపరచాలని కోరారు. ఈ పరిసర ప్రాంతంలో మరో 800 కుటుంబాలకు వ్యక్తిగత ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని, కానీ ఇక్కడ విద్య, వైద్యానికి కావలసిన ఏర్పాట్లు చేయలేదని పేర్కొన్నారు. ఇక్కడ స్కూలు ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక వసతులు కల్పించక పోవడం వలన చాలామంది ఇంట్లో నివాసం ఉండటానికి భయపడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ జోక్యం చేసుకొని వెంటనే ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు.

టిడ్కో గృహాల లబ్దిదారులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

జోరుగా వినాయక విగ్రహాలు అమ్మకం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు జోరుగా విక్రయాలు సాగాయి. మండలంలోని హరిపాలెం, చౌడపల్లి గ్రామాలలో వినాయక విగ్రహాలను తయారు చేశారు. నెల రోజులుగా కళాకారులు ఇదే పనిలో ఉన్నారు. హరిపాలెంలో తయారు చేస్తున్న వినాయకులను దేశం నలుమూలలకు ప్రత్యేకమైన వాహనాల ద్వారా తరలించారు. రంగురంగుల అలంకరణలతో, వివిధ భంగిమలతో తయారు చేయడంలో కళాకారులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించారు. వినాయక విగ్రహాలు సైజును బట్టి పది రూపాయల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన యువకులు, ఎస్ఈజెడ్ పరిశ్రమలలో కార్మికులు విగ్రహాల కొనుగోలు చేశారు. ముందుగా వచ్చి వారికి కావలసిన రూపు రేఖలతో నమూనాలను చూపించి వాటిని తయారు చేయించుకొని తీసుకెళ్లారు. వినాయక విగ్రహాలు తయారు ద్వారా తమకు జీవనోపాధి కలుగుతుందని తయారీదారులైన మునగపాక శివ, తంగేటి సత్తిబాబు, మురళి, అబ్బాయి, లోవరాజు తెలిపారు.

ట్రాఫిక్ అంతరాయం

అచ్యుతాపురం -హరిపాలెం ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. ఎస్ఈజెడ్ పరిశ్రమలలో విధులు ముగించుకొని తిరిగి వచ్చే ద్విచక్ర వాహనాలతో రహదారి కిక్కిరిసింది. మండలంలోని హరిపాలెం, చౌడపల్లి, అచ్యుతాపురంలో వినాయక విగ్రహాలను విక్రయించారు. భారీ విగ్రహాలను కొనుగోలు చేసి క్రేన్ సాయంతో ట్రాక్టర్లు, వ్యాన్లు ద్వారా దూర ప్రాంతాలకు తీసుకెళ్తున్న సమయంలో ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అచ్యుతాపురం మండల కేంద్రంలో రహదారిపై పండ్లు, పూలు, వినాయక ప్రతిమలు, ఇతర పూజా సామాగ్రి విక్రయాలతో రద్దీగా మారింది. వ్యాపారులు, కొనుగోలుదారులతో జంక్షన్ కిక్కిరిసింది. పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాటితో జంక్షన్‌లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

బుచ్చయ్యపేట : వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని బుచ్చయ్యపేట, సీతయ్యపేట, వడ్డాది తదితర ప్రాంతాల్లో విగ్రహాలను

అనకాపల్లిలో వినాయక చవితి సందడి

అనకాపల్లి : వినాయక నవరాత్రులు వస్తున్నాయంటేనే గ్రామాల్లో, పట్టణాల్లో సందడి నెలకొంటుంది. వీధి వీధిన వినాయకుని మండపాలను ఏర్పాటు చేసి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో వినాయక ప్రతిమ నుంచి ప్రతి ఇతర సామాగ్రి కొనుగోలు చేస్తుంటారు. కాగా శుక్రవారం అనకాపల్లి పట్టణం నెహ్రూ చౌక్ జంక్షన్ నుంచి పెరుగు బజార్ వరకు పలు ప్రాంతాల్లో వినాయక ప్రతిమలు, పూజా సామాగ్రి కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో మార్కెట్ సందడిగా నెలకొంది. వినాయకుని ప్రతిమలు రూ.50 నుంచి గరిష్టంగా రూ.10వేలు వరకు మార్కెట్లో అమ్మకానికి పెట్టారు. పూజా సామాగ్రి ధరలు కూడా గత ఏడాది కంటే పెరిగాయి. అయినా ప్రజలు కొనుగోలు చేసేందుకు వెనుకాడ లేదు.

అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. వివిధ రకాల పూజా సామాగ్రిని, మండపాలలో అలంకరణకు ఉపయోగించే రకరకాల సామాగ్రిని అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి. పలు గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువలు అధ్వానంగా తయారయ్యాయని, దీనివలన గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలుగు రైతు నియోజకవర్గం ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పలు సమస్యలపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని పర్యవేక్షణ అధికారి ఎం.శ్రీనివాసరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ చేపట్టకపోతే వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తక్షణమే తాగునీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేయించి, గ్రామంలో బ్లీచింగ్ చేసి, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విడుదల సత్యారావు, బొబ్బిలి సత్తిబాబు, చామంతుల బాలు పాల్గొన్నారు.

శేషుగెడ్డ ముంపు సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : ఎగువన ఏమాత్రం పెద్ద వర్షం పడినా శేషుగెడ్డ పొంగి ప్రవహించి పాత జాతీయ రహదారి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని, దానికి శాశ్వత పరిష్కారంగా బ్రిడ్జి నిర్మించాలని సిపిఐయం జిల్లా నాయకులు చింతకాయల శివాజీ, ఎస్ఎఫ్ఐ నాయకులు కారే మణికంఠ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి జాతీయ రహదారి నుండి పట్టణంలోకి వచ్చే వాహనాలకు తీవ్ర ఆటంకం ఏర్పాడిందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన తూములు పూడుకు పోవడంలో ముంపు ఏర్పాడుతోందని సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు పూనుకోవాలని వారు కోరారు.

విజయవాడ వరద బాధితులకు 'జాగృతి' సహాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని జాగృతి స్వచ్ఛంద సంస్థ, దాని అనుబంధ సంస్థ అయిన అమృతఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం తరపున విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపించింది. అనకాపల్లి జిల్లా ఉద్యానవన శాఖ ఆదేశాల మేరకు వీటిని పంపించినట్లు జాగృతి ఎండి కందర్ప సుజాత తెలిపారు. విజయవాడకు సరుకులు తీసుకెళ్లిన వాహనానికి అమృతఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు పొట్నూరి అప్పారావు జెండా ఊపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. మండలంలోని రాజాం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలలో భాగంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు అధికంగా తీసుకుంటే రక్తహీనత నుంచి బయటపడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది పలు రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

శాంతియుతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : గణపతి నవరాత్రుల ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని కొత్తకోట సిఐ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్దమదిన, దిబ్బిడి గ్రామాల్లో గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, ఊరేగింపుల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బుచ్చయ్య పేట ఎస్ఐ డి.ఈశ్వరరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూడిమడక తీరంలో గస్తీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడక తీరంలో గురువారం కోస్టల్ సెక్యూరిటీ మెరైన్ పోలీస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పివిఆర్ఎస్.వర్మ పరిరక్షణలో ప్రత్యేక గస్తీ నిర్వహించారు. సముద్ర తీరం వెంబడి అపరిచిత వ్యక్తులు గాలింపు, సముద్ర తీర గ్రామాలకు వెళుతున్న రాకపోకలు సాగిస్తున్న ఆటోలు పలు వాహనాలను ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరవాడ డిఎస్పి కెవిఎల్ సత్యనారాయణ, పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ పంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి, డిపిఆర్సి సమన్వయ కర్త నాగమణి శుక్రవారం సందర్శించారు. ఆ కేంద్రం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శి కూర్మారావుకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి యం.సోమరాజు పాల్గొన్నారు.

విధినిర్వహణలో మరణించిన

పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం

ప్రజాశక్తి- అనకాపల్లి

విధి నిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలను ఆదుకుంటామని ఎస్పి ఎం.దీపిక అన్నారు. జిల్లా విధి నిర్వహణలో అనారోగ్యం, ప్రమాదాల్లో మరణించిన 19 మంది పోలీసు కుటుంబ సభ్యుల సమస్యలపై శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మరణించిన పోలీసుల సేవలను కొనియాడి, తన సంతాపాన్ని తెలిపారు. మీరంతా పోలీస్ కుటుంబంలోని సభ్యులేనని, పోలీసుల సంక్షేమమే ప్రధమ కర్తవ్యమని తెలిపారు. ఎటువంటి సహాయం అవసరమైన నేరుగా తనను కలవచ్చన్నారు. ప్రభుత్వ పరంగా వారికి మరణానంతరం రావలసిన బెనిఫిట్స్, కారుణ్య నియామకాలు, ప్రభుత్వ నుండి రావలసిన ఇతర ఆర్థికపరమైన బెనిఫిట్స్ త్వరగా అందేటట్లు చర్యలు చేపడతామని తెలిపారు. కారుణ్య నియామకాల గురించి జిల్లా కలెక్టర్‌కు లెటర్ పెట్టడం జరిగిందని, ఉద్యోగ ఖాళీలు, సీనియార్టీ ప్రకారం నియామకాలు జరుగుతాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పోలీస్ నుండి డిప్యూటేషన్ పై స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న హెూంగార్డు పి.అప్పలనాయుడు అనారోగ్యంతో మరణించిన కారణంగా అతని భార్య కుమారికి సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.15 వేలను ఎస్పి అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఏవో బి.శారద, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సతీష్, సంజీవరావు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన

మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

సదస్సులో పాల్గొన్న ఎస్ఐ రాములమ్మ, ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అధ్యక్షతన గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న దిశ ఎస్ఐ పి రాములమ్మ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యపరమైన సమస్యలు తెచ్చుకోవద్దని హితవుపలికారు. మత్తులో పడి అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం ఈ మధ్యకాలంలో ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మరో అతిథి డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వలన గుండె జబ్బు, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడతారన్నారు. అడ్వకేట్ జి. సురేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనకు విద్యార్థులు యువకులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ, కళాశాల ప్రిన్సిపాల్ డి స్వాతి, రైటర్ నవీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలో గురువారం పడిన వర్షానికి అంతకపల్లి పంచాయతీ శివారు ఒమ్మివానిపాలెం గ్రామంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న గొంప ముత్యాలు, గొంప రమణలకు చెందిన రెండు పూరిల్లు నీట మునిగాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీటీసీ చొక్కాకుల గోవింద్ ఆ రెండు కుటుంబాలకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, టమాటో తదితర నిత్యావసర వస్తువులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి కోటి, కాయితి గంగరాజు, శ్రవణ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పంచాయతీని ఎంపిడిఒ వివి.రవికుమార్ శుక్రవారం సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఎన్.సత్యారావు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానిస్తున్న దృశ్యం

జర్నలిస్టులకు సన్మానం

ప్రజాశక్తి-చోడవరం : వాసవి క్లబ్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చోడవరం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అధ్యక్షుడు కలగర్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో స్థానిక పాత్రికేయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు బీమకుర్తి ప్రభాకర్ మాట్లాడుతూ క్లబ్ వ్యవస్థాపకుడు కెసి.గుప్తా జన్మదినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది క్లబ్ వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 1 నుండి ప్రారంభమైన వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం, వృద్ధాశ్రమానికి కిరాణా సరుకులు వితరణ, ఉపాధ్యాయ కాలేజీలో యువతకు సందేశం, విలేఖరులకు సన్మానం తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి కలగర్ల అప్పల నరసింహమూర్తి వాసు, కోశాధికారి పసుమర్తి లక్ష్మణ, డిప్యూటీ గవర్నర్ శ్రీనాథ్ వెంకట మాధవ (మధు), ఆర్ఎస్.సతీష్, వనిత క్లబ్ అధ్యక్షులు ఉషశ్రీ, కార్యదర్శి జానకి, కోశాధికారి తులసి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, విఠల్‌రావు, నాగేశ్వరరావు, జోన్ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధివినాయక ఆలయ 28వ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట మేజర్ పంచాయతీ, కస్పా వీధిలోని శ్రీసిద్ధివినాయక ఆలయ 28వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ వేర్వేరుగా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నాకర్ అన్న సమారాధన పాల్గొని, మట్టి వినాయక విగ్రహం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిదిరెడ్డి శ్రీను, కలగా సోమేశ్వరరావు, కలగా శివనందం, వేగి దొరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి.మల్లేశ్వరరావును మండలంలోని పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోతల పాత్రునాయుడు, దొగ్గ నాయుడుబాబు, చామంతుల వెంకన్న దొర, బండారు రామారావు, కర్రి నాయుడు, రెడ్డి బలరాం, పెనగంటి సింహాచలం నాయుడు, కడిమి నాగేశ్వరరావు, గుర్రెడ్డి కొండలరావు, కిల్లి గోవింద, చింతా సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రామచంద్రపురం కల్వర్టు

- ఆందోళనలో వాహనదారులు, గ్రామస్తులు

ప్రజాశక్తి -కోటవురట్ల :మండలంలో రామచంద్రపురం సెంటర్ వద్ద బ్రిటీష్ కాలంలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. గడిచిన 8 నెలలుగా కల్వర్టు మధ్యలో సుమారు అడుగున్నర మేరకు కృంగి పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భీతిల్లుతున్నారు. కృంగిన వంతెన పై నుండే భారీ వాహనాలు, బస్సులు, విద్యార్థుల స్కూల్ బస్సులు, నిత్యం తిరుగుతుంటాయి.ఇటీవల ఆర్ అండ్ బి అధికారులు భారీ వాహనాలు ప్రవేశించకుండా చేపట్టిన చర్యలు మూడు నాళ్ళ ముచ్చటగానే మిగిలి పోయాయి. నియోజకవర్గ కేంద్రానికి, డివిజన్ కేంద్రానికి, నక్కపల్లి, పాయకరావుపేట, రాయవరం, మండలాల ప్రజలు రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. నర్సీపట్నం రైలు మార్గానికి ప్రయాణికులు వెళ్లాలన్నా ఇదే దారి కావడం విశేషం. గడిచిన ప్రభుత్వంలో పలుమార్లు గ్రామస్తులు సహ మండల వాసులు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కల్వర్టు నుంచి కొండనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో, ఏ క్షణమైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టక పోవడంతో వివిధ మండలాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

పంటల సాగుపై ఆరా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం ఇన్చార్జ్‌లు, వ్యవసాయ, ఉద్యాన శాఖకు సంబంధించిన సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంకు జిల్లా ఉద్యానశాఖ అధికారి జి.ప్రభాకరరావు, నాలుగు మండలాల ఉద్యాన అధికారి ఎస్.శిరీష హాజరై ఈ క్రాప్, పామాయిల్, ఉద్యాన, వ్యవసాయ, పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు సేవా కేంద్ర ఇన్చార్జ్‌లు చేయవలసిన పనులను వివరించి త్వరగా చేయాలని తెయజేసారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ను రెండు రోజుల నుండి నక్కపల్లి ఇసుక ర్యాంపు వద్ద డ్యూటీ వెయ్యడంతో, సచివాలయంలో ఆయన అందిస్తున్న సేవలు నిలిచిపోయాయని ఆ గ్రామ పంచాయితీ పదవ వార్డ్ మెంబర్ మైలపల్లి మహేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నార్నారు.శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ కు ఈ సమస్యపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని డిజిటల్ అసిస్టెంట్‌ను వెంటనే సచివాలయానికి పంపించి ,యధావిధిగా సేవలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మైలపల్లి బాపూజీ, కొడ కాశీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్

పాతమల్లంపేటలో గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాతమల్లంపేట గ్రామంలో శుక్రవారం సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మీ అధ్యక్షతన పీఎం జన్ మన్ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ. దేవిడ్‌రాజు మాట్లాడుతూ, ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహ అభియాన్ యోజన(పీఎం జనమన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి సంపూర్ణ అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుదీప్పు, వెలుగు ఏపీఎం మంగ, టీడీపీ సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వినాయక చవితి సందడి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని 7 తేదీ శనివారం వినాయక చవితి సందర్భంగా సందడి నెలకొంది. పలు గ్రామాల్లో యువకులు మండపాలు సిద్ధం చేశారు. వివిధ రూపాల్లో ఉన్న గణపతి విగ్రహాలను కొనుగోలు చేశారు. మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో లక్ష్మీ గణపతి దేవస్థానంలో గణపతి నవరాత్రుల మహోత్సవములు ఘనంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.గ్రామాల్లో చిన్నా పెద్దా అని తేడా లేకుండా వినాయక చవితి ఉత్సవాలు ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారు. పెద్దలు, కమిటీ సభ్యులు ఉత్సవాలు ఏర్పాట్లపై నిమగ్నమయ్యారు .

కోటవురట్లలో సిద్ధంగా ఉన్న విగ్రహాలు

వినాయక ప్రతిమలు సిద్ధం

కోటవురట్ల:మండల కేంద్రంలో లింగాపురం సెంటర్ వద్ద వినాయక విగ్రహాలను నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు. గడిచిన తొమ్మిది నెలలుగా ఇక్కడ తయారు చేసిన చేసిన విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఈనెల 7న జరగనున్న వినాయక చవితి పురస్కరించుకొని మండల వాసులు మాత్రమే కాకుండా ఇతర మండలాల నుండి కూడా ఇక్కడి విగ్రహాలకు డిమాండ్ ఉంటుంది. తయారీ కేంద్రానికి అద్దెలు, కరెంటు బిల్లులు, ఖర్చులు, , సామగ్రి వివరీతంగా పెరిగి పోవడంతో నిర్వాహకులు ఆందోళన చెబుతున్నారు. వినాయక చవితి రెండు రోజులు మాత్రమే ఉండడంతో విగ్రహాలు అమ్మకాలపై నిర్వాహకులు ఆశలు పెంచుకుంటున్నారు.

పాఠశాలల్లో వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలోని వేములపూడి ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ అనీషా విద్యార్థినులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములపూడి, నాతవరం వైద్యాధికారులతో పాటు సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోటో నెట్ 1వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వడ్డాది:వడ్డాది కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజిస్ట్ పి.అనూష, వడ్డాది పీహెచ్సీ వైద్యాధికారి మౌనిక బాలికలకు తనిఖీలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. హాస్పిటల్లో 260 మంది విద్యార్థినులకు తనిఖీలు నిర్వహించగా 45 మందికి గైనిక్ సమస్యలు, 21 మందికి సాధారణ జనరల్ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని వైద్యాధికారి మౌనిక తెలిపారు. వీరికి అవసరమైన అన్ని మందులు అందజేశామన్నారు. ప్రతినెలా తనిఖీలు నిర్వహించి మందులు అందిస్తామని తెలిపారు. ఏఎన్ఎం కనకలక్ష్మీ కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాదిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నక్కపల్లి లో వర్షం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని శుక్రవారం మోస్తారు వర్షం కురిసింది. సుమారుగా 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. రోడ్లు జలమయమయ్యాయి. పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. వర్షంతో మార్కెట్‌లో కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వినాయక చవితి సందర్భంగా వినాయకుని బొమ్మలు, పత్రులు విక్రయించే వ్యాపారులు వర్షంతో ఇబ్బందులకు గురయ్యారు. బొమ్మలు తడిసిపోకుండా టార్పాలినులు కప్పారు.

కురుస్తున్న వర్షం

సిఐ, ఎస్ఐలకు అభినందనలు

ంప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి సిఐ కుమారస్వామిని శుక్రవారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ,పసుపుగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల కుమారస్వామి సిఐగా బాధ్యతలు చేపట్టారు. సీఐ ను కలిసిన వారిలో ఆ పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, పాము గణేష్ తదితరులు ఉన్నారు .

సన్మానిస్తున్న నాయకులు

మాడుగుల: మాడుగుల నూతన ఎస్సై నారాయణరావును మండల ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం పోలీసు స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం ఎస్సైను శాలువాతో సత్కరించారు. మండలంలో సమస్యలపై వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు జల్లీ అప్పారావు, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఎలుసూరి గాటీలు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎంఎం దాస్, ఎం ఆర్ పి ఎస్ నాయకులు లక్కీడపు ప్రసాద్, పాల్గొన్నారు.

హౌసింగ్ ఇంజినీర్‌గా వరప్రసాద్

ప్రజాశక్తి -కోటవురట్ల:గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్‌గా బి.వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనకాపల్లి గృహ నిర్మాణ శాఖ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన జగదీశ్వరరావు గత నెల 31న పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా అర్హులైన వారందరికీ ఇల్లు మంజూరుతో పాటు బిల్లులు మంజూరుకు అదేవిధంగా కాలనీల వద్ద సౌకర్యాలకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

సన్మానిస్తున్న విద్యార్థులు

రిషిలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక రిషి విద్యాసంస్థలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమానికి రిషి విద్యాసంస్థల కరస్పాండెంట్ కోన సతీష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులు మంచి ప్రణాళికను వేసుకొని, ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. రాబోయే తరాల వారికి మార్గదర్శకంగా ఉండాలని, తమ విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు, ఉన్నత శిఖరాలకు చేరుకున్నార్నారు.గత విద్యా సంవత్సరంలో, టౌన్ టాపర్స్ ఎంపీసీలో కె దుర్గా, గాయత్రి, బైపీసీలో వి ప్రణతి, సీఈసీలో రెడ్డి సత్యనారాయణలను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ఆర్వే నాయుడు, అధ్యాపకులు హాజరయ్యారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -నాతవరం:జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఇచ్చిన గ్రీన్ ఆంధ్ర క్లీన్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు ప్రగడ కృష్ణబాబు మండలంలోని వల్సంపేట పంచాయతీ దారగంగవరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలను జేసిబి సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్య సేవలుండాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో వైద్యసేవలుండాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆరిలోవ హెల్త్‌సిటీలో మెడికవర్ కేన్సర్ ఆసుపత్రి విభాగాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, మెడికవర్ ఆసుపత్రి సేవలు ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. కేవలం దశాబ్దం కాలంలో నాలుగు రాష్ట్రాల్లో 23 ఆసుపత్రులు, ప్రపంచంలో 9 దేశాలలో 1200 మంది వైద్యులు, 13 వేల మంది వైద్య సిబ్బందితో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేవలందిస్తున్న స్థాయికి మెడికవర్ ఆసుపత్రి చేరుకోవడం అభినందనీయమన్నారు. నానాటికి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, కలుషిత ఆహారం, జీవన శైలి కారణంగా వయస్సుతో నిమిత్తం లేకుండా విజృంభిస్తున్న కేన్సర్ వంటి భయంకర వ్యాధిని ఎదుర్కోవడానికి ప్రత్యేక ఆసుపత్రులు విస్తరింప చేయడం అవసరమన్నారు. ఇందులో భాగంగా మెడికవర్ ఆసుపత్రి ప్రత్యేకంగా కేన్సర్ చికిత్స విభాగాన్ని ప్రారంభించడం హర్షదాయకమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, పేదలకు అందుబాటు ధరల్లో వైద్యసేవలు అందించాలని మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు.

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, మెడికవర్ కేన్సర్ ఆసుపత్రిలో రోబొటిక్ సర్జరీ సౌకర్యాలు వల్ల కేన్సర్ వ్యాధికి ఎంతో సమర్థవంతంగా చికిత్స చేయడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్‌డి డాక్టర్ జి.అనిల్‌కృష్ణ మాట్లాడుతూ, భారత దేశంలో అగ్రగామిగా ప్రస్తుతం 24 ఆసుపత్రులను తాము నిర్వహిస్తూ ఏటా లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ శరత్‌రెడ్డి, పి.హరికృష్ణ, డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

మెడికవర్ కేన్సర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

చెక్కపై చెక్కిన వినాయకులు

చెక్కపై గణనాథుని ప్రతిరూపం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి చెక్కతో వినాయకుని ప్రతిరూపాలు చెక్కి తన భక్తిని చాటుకున్నాడు. శనివారం వినాయక చవితి సందర్భంగా చెక్క పై రెండు వినాయకుని ప్రతిరూపాలను అద్భుతంగా తీర్చిదిద్దాడు . గంట సమయంలో వినాయకుని ప్రతిరూపాలను చెక్కినట్లు రవి తెలిపాడు. పర్వదినాల్లో రవి తన సూక్ష్మ కళను ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే.

మాట్లాడుతున్న శంకరరావు

బిఎన్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి -కొత్తకోట:చోడవరం నియోజకవర్గంలో బి ఎన్ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ పరిధిలో సిపిఎం సమావేశం శుక్రవారం కళ్యాణపు లోవ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత శంకర్రావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పాడైపోయిన రోడ్లకు క్రషర్ బుగ్గి ద్వారా గొయ్యిలను పూడ్చాలని ఆదేశించారన్నారు. అయినప్పటికీ ఆ ఆదేశాలను ఆర్ అండ్ బి శాఖ అధికారులు పట్టించకపోవడం పై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో నిరంతరం వందలాది మంది ప్రయాణికులు అనేక ఇబ్బందులకి గురవుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి ఎంపీ గెలిచిన వెంటనే రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి నియోజకవర్గ ప్రయాణికులకు సేవలు అంద చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ వంద రోజులు పూర్తి చేసుకున్నా అమలు కాలేదన్నారు. కొత్తకోట కేంద్రంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రజల కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించు కోలేదని విమర్శించారు. ఎ ి వి టి జి తెగలైన గదభ, కొండు ఆదివాసి తెగ గిరిజనుల కోసం ప్రధానమంత్రి జన్ మన్ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకం లో ప్రధానంగా వైయస్సార్ జగనన్న రీ సర్వేలో ఆదివాసిలు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వకుండా గిరిజనేతరులకు పట్టాలిచ్చారని ఆరోపించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, పాంగి చంద్రయ్య, సూరిబాబు, గేమెల వాసు పాల్గొన్నారు.

9 నుంచి నక్కపల్లిలో జనవాణి

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి లో ఈనెల 9వ తేదీ నుంచి జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ వెల్లడించారు. నక్కపల్లిలో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను తెలుసుకుని ,వాటిని పరిష్కరించేందుకు గాను జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు విడతలుగా ,నాలుగు మండలాల్లో జనవాణి కార్యక్రమ చేపట్టనున్నామని, దీనిలో భాగంగా తొలి విడతగా నక్కపల్లి మండలంలో జనవాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నక్కపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో ఈనెల 9వ తేదీ సోమవారం నుండి ప్రారంభం కానున్న జనవాణి కార్యక్రమం నెల రోజులపాటు కొన సాగిస్తామన్నారు.

రహదారులు జలమయం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో చినుకు పడితే చాలు చిత్తడిగా తయారవుతుంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సీతారామరాజు నగర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమీపంలో వద్ద కాలనీ మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయం ఎదురు ప్రధాన రహదారిపై వర్షపు నీరు చినుకు రాలితే చాలు చెరువులను తలపిస్తోంది. అయినా అధికారులు ఎవరు పట్టించుకోకపోవడం విశేషం. నిత్యం రద్దీగా ఉండే రహదారులనే అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు విమర్శించారు. ప్రధానంగా మండల కేంద్రంలో ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించుకోవడంపై అధికారులు రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గి మీన మేశాలు లెక్కిస్తున్నారు. రెవెన్యూ ,ఆర్ అండ్ బి, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అణుకులో అధికారుల పర్యటన

- సమస్యలపై ఆరా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని గుట్టువాడ శివారు గిరిజన గ్రామమైన అణుకు గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జన్ మన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అధికారులు సందర్శించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని నాగ శిరీష, మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ పాల్గొని గిరిజనులను వారి వసతులు, ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు, గ్రామంలో చేపట్టాల్సిన కాలనీ ఇల్లు, తాగునీటి, మంచినీటి, విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్యం, సహా సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జన్ మన్ కార్యక్రమం ద్వారా గ్రామ సమస్యలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరు వర్మ, హౌసింగ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏపీవో గంగు నాయుడు, ఆర్ఐ ఊర్ధవరావు, విద్యుత్ శాఖ,శిశు సంక్షేమ శాఖ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

ప్రత్యేక ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తల్లిదండ్రులు

ప్రత్యేక ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం భవితా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలంలో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలు, సదుపాయాలను ప్రత్యేక ఉపాధ్యాయులు అందిస్తున్నారని తల్లిదండ్రులు కొనియాడారు.ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడుతో పాటు మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యా యుడు మహాలక్ష్మి నాయుడు, సిఆర్పి రామారావు, బుచ్చయ్యపేట భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు దేముడు నాయుడులను సత్కరించారు.

రోడ్డు నిర్మించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం దొంకాడ నుంచి పప్పుశెట్టిపాలెం వరకు రోడ్డు నిర్మించాలని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, దొంకాడ నుండి పప్పుశెట్టిపాలెం వరకు సుమారు నాలుగు కిలో మీటర్లు రోడ్డు నిర్మించక పోవడంతో వర్షాకాలంలో ఆసుపత్రులకు, నిత్యావసరాలకు వెళ్లడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం పిల్లలు బడి పోవడానికి మార్గం లేదన్నారు. ఈ వర్షాలకు వారం రోజులుగా పది మంది పాఠశాల విద్యార్థులు (జిల్లేడిపూడి) పాఠశాలకు పంపించలేదన్నారు. గెడ్డలు దాటి పిల్లలు స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా దొంకాడ గ్రామంకు రోడ్డు సౌకర్యం లేదన్నారు. తక్షణమే రోడ్డు మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, సత్తిబాబు, ఎం.పాండురాజు, సుబ్బారావు, నారీ, చంటి తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు